క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి



జెండా ఆవిష్కరిస్తున్న గంగయ్య

ఇచ్చోడ: కార్మిక, కర్షక సమస్యల పరిష్కారానికి పోడుతామని సీపీఐ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య అన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ జెండా ఆవిష్కరించారు. కమ్యూనిస్టులు లేకుండా ఏ పోరాటం జరగలేదన్నారు. ప్రజల కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరంగా ముందుండి పోరాటం చేస్తుందన్నారు. కమ్యూనిస్టుల పోరాటల ఫలితంగా ఎన్నో ప్రజా సమస్యలు పరిష్కారించబడ్డాయన్నారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



సర్వే చేస్తున్న సిబ్బంది

ఇచ్చోడ: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. ఆదివారం మండల కేంద్రంలో టీచర్స్‌కాలనీ, అశోక్‌నగర్ కాలనీలో ఎంపీవో సత్యానంద్ ఆధ్వర్యంలో సర్వే కొనసాగింది. ఖాళీస్థలాలు ఉండి ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి వారి వివరాలను యాప్‌లో సేకరిస్తున్నట్లు ఎంపీవో సత్యానంద్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారుల వివరాలను యాప్‌లో నమోదు చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ సిబ్బంది చింతల భూమారెడ్డి, తదితరులు ఉన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. మండల కేంద్రంలోని 15వ వార్డులో ఈవో అంజయ్య, సిబ్బంది సర్వే నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. కాంగ్రెస్ నాయకులు నాజర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఇంద్రవెల్లి: మండలంలోని పలు బాధిత కుటుంబాలను ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు పరామర్శించారు. మండలంలోని మెండపల్లి గ్రామానికి సందర్శించి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముండే సుదం, ఏమాయికుంట గ్రామానికి సందర్శించి ఇటీవల జిన్నింగ్ మిల్లులో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పర్సు రాంనాయక్ కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పర్ధాన్‌గూడ గ్రామానికి సందర్శించి అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజును కలిసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

బోథ్: సొనాల గ్రామానికి చెందిన కోస్మెట్టి దేవిదాస్ సతీమణి ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట సదానందం, చిలుకూరి భూమయ్య, సుధీర్ రెడ్డి, ముండే పాండురంగ్, రాహుల్, రమేశ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన భవన అనే మహిళ గత నెలలో బస్టాండ్‌లో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. దీంతో ఆమె టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయగా, పోలీసులు ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ సీఐ కరుణాకర్ రావు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఆమెకు ఫోన్‌ను అందజేశారు. ఇందులో పోలీసు సిబ్బంది ప్రవీణ్, సంజీవ్, నరేందర్

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



సన్మానిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

కైలాస్‌నగర్: క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికలలో విజయం సాధించిన జిల్లా నాయకులను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో శాలువాతో సత్కరించారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నాయకులు చరణ్ గౌడ్, నాగరాజు, శాంతన్ రావ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం.. నగర సంకీర్తనం

- క్రమం తప్పని భగవన్నామస్మరణ
- లోక కల్యాణార్థం నిత్య కీర్తనలు
- 14 వసంతాలు పూర్తి



నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

ఆదిలాబాద్: వారంతా వేకువ జామున లేచి, స్నానం చేసి, తెల్లని వస్త్రాలు ధరించి భక్తి పారవశ్యంలో మునిగిపోతారు. కాలమేదైనా క్రమం తప్పకుండా భక్తి గీతాలతో పట్టణ పురవీధుల గుండా సాగుతూ ఆధ్యాత్మికతను వెదజల్లుతారు. భగవన్నామ స్మరణ చేస్తూ పట్టణంలోని పురవీధుల్లోని దేవాలయాల వద్ద ఆగుతూ తన్మయత్వంతో భజన కీర్తనలు ఆలపిస్తారు. ఈ విధంగా గత 14 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నగర సంకీర్తన చేస్తూ సర్వేజనా సుఖినోభవంతు అనే సనాతన ధర్మ వైశిష్ట్యాన్ని కాపాడుతూ, ప్రాచీన సంస్కృతిని సంరక్షిస్తున్నారు.

సనాతన సాంప్రదాయం..

వేకువ జామునే బ్రహ్మ ముహూర్త కాలంలో, సంధ్యా సమయంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో భగవన్నామ స్మరణ చేస్తూ, భక్తి గీతాలు ఆలపించేవారు. విశ్వ మానవ శ్రేయస్సును కాంక్షిస్తూ చేసే ఈ పారాయణలో ఎంతో భక్తి ప్రపత్తులు, నిగూడ ఆధ్యాత్మికత, ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. సూర్యోదయానికి ముందే లేచి సంకీర్తనలు ఆలపించడం వలన ఎంతో మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

14 వసంతాలుగా..

2010 సంవత్సరంలో నగర సంకీర్తన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతినిత్యం ఉదయం 5 గంటలకు పట్టణంలోని మార్వాడి ధర్మశాల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి సంకీర్తన ప్రారంభమవుతుంది. భక్తి గీతాల నడుమ బ్రాహ్మణవాడ మీదుగా శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠానికి చేరుకొని వేంకటేశ్వర ఆలయానికి ఉదయం 8 గంటల వరకు తిరిగి వచ్చి నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులందరూ హారతిలో పాల్గొంటారు. స్వామి వారిని కొలిచి, తీర్థ ప్రసాదాలు స్వీకరించి తమ ఇళ్లకు పయనమౌతారు.

ఉదయం 5 గంటలకు..



నగర సంకీర్తన ఎంతో నియమబద్ధంగా ఉంటుంది. ప్రతీరోజు ఉదయం సరిగ్గా 5 గంటలకు సంకీర్తన మార్వాడి ధర్మశాల ఆలయం నుంచి ప్రారంభమైపోతుంది. ఐదు గంటల వరకు ఎంత మంది వస్తే అంతమందితో సంకీర్తన మొదలవుతుంది.

– బందారి దేవన్న, భుక్తాపూర్, ఆదిలాబాద్

లోక కల్యాణం కోసం..



నగర సంకీర్తనకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. గ్రామాల్లో ఉదయాన్నే లేచి భక్తి గీతాలు ఆలపిస్తూ నగర సంకీర్తనలు చేసేవారు. దీంతో ప్రజల్లో భక్తి భావం పెంపొందుతుంది. లోక కల్యాణం కోసం పెద్దలు పెట్టిన సాంప్రదాయాన్ని పాటిస్తూ సనాతన విలువలను పరిరక్షించేందుకు పాటుపడుతున్నాం.

– గంజీవార్ స్వామీ, టీచర్స్ కాలనీ

మానసిక ప్రశాంతత



గత 13 సంవత్సరాలుగా నగర సంకీర్తనలో పాల్గొంటున్నాను. సంకీర్తనలో పాల్గొనడం వలన ఎంతో మానసిక ప్రశాంతత చేకూరుతోంది. క్రమం తప్పకుండా సంకీర్తనకు హాజరవుతున్నాను. కాలంతో సంబంధం లేకుండా ప్రతి రోజూ ఉదయం సంకీర్తన కొనసాగుతుంది.

– అవినాష్, అంబేద్కర్ చౌక్, ఆదిలాబాద్

ఎన్నో ప్రయోజనాలు



నగర సంకీర్తన వలన ఎన్నో లాభాలు ఉన్నాయి. నిత్యం భగవంతున్ని స్మరించడంతోపాటు ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. ఉదయం సమయంలో దేవుడిని స్మరిస్తూ పట్టణమంతా తిరగడం వలన శారీరకంగా సైతం ఎంతో బాగుంటుంది. ఎటువంటి అనారోగ్యాలు దరి చేరవు.

– శ్యామ్ ముందడ, రవీంద్ర నగర్

అలవాటుగా మారింది



ప్రారంభంలో వేకువ జామున లేచి రావడం కొంత ఇబ్బందికరంగా ఉండేది. అయితే ఉదయాన్నే లేచి సంకీర్తనకు రావడం అలవాటుగా మారిపోయింది. భక్తి గీతాలు ఆలాపనతో రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. ప్రతిరోజు ఆధ్యాత్మిక ఆలోచనలతో రోజు గడిచిపోతుంది.

– విజయ్ కుమార్, భుక్తాపూర్, ఆదిలాబాద్

కష్టపడే కార్యకర్తలకే గుర్తింపు

నార్నూర్: పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకే గుర్తింపు ఉంటుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం జిల్లా పర్యటనకు సందర్భంగా కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన కొలెట్కర్ పరమేశ్వర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమేశ్వర్‌ను పార్టీ గుర్తించి జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆయన కోరారు. పనిచేసే కార్యకర్తలకు ఎప్పుడు అండదండలు ఉంటాయన్నారు.

కైలాస్‌నగర్: మాలల ఆత్మీయ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదివారం కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన ఆయన తన ఛాంబర్‌కు ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. జిల్లా రాజకీయ పరిస్థితులపై కొద్దిసేపు చర్చించారు.

కంటైనర్ బోల్తా.. తప్పిన ప్రమాదం



బోల్తా పడిన కంటైనర్

నేరడిగొండ: మండలంలోని కుప్టి ఘాట్ ప్రాంతంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం కంటైనర్ బోల్తా పడింది. ఆదిలాబాద్ వైపు నుంచి నిర్మల్ వెళ్తున్న కంటైనర్ ఘాట్ ప్రాంతంలో అదుపు తప్పింది. ఆ సమయంలో అటువైపుగా వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎన్‌హెచ్ఏఐ అధికారులు, పోలీసులు బోల్తా పడిన కంటైనర్‌ను పక్కకు జరిపి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తాంసి: టీయూటీఎఫ్ 2025 క్యాలెండర్‌ను ఆదివారం భీంపూర్ ఎంఈవో శ్యాంసుందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో టీయూటీఎఫ్ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, భీంపూర్ అధ్యక్షుడు శివారెడ్డి, రామారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి

సిరికొండ: ఎడ్లకు నీరు తాగించేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని చిమ్మన్‌గూడిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిమ్మన్‌గూడి గ్రామానికి చెందిన రైతు రాథోడ్ ఈశ్వర్ (45) ఎడ్లను మోపి, సాయంత్రం నీరు తాగించేందుకు బావి వద్దకు తీసుకెళ్లగా కాలు జారీ బావిలో మృతి చెందినట్లు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బజార్‌హత్నూర్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో అనిల్ అన్న యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ, క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి హాజరయ్యారు. క్రీడలతో శారీరక దారుఢ్యం కలుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తామన్నారు. క్రీడాకారులతో కలిసి కబడ్డీ, క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. అంతకుముందు మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైటింగ్ సిస్టంను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దుబ్బుల చంద్రశేఖర్, కానిందే రాజారాం, చిల్కూరి భూమయ్య, రమణ, ప్రశాంత్, విద్యాసాగర, చట్ల గజ్జయ్య, కవిందర్, లక్ష్మణ్, అరుణ్, మారుతి, చైతన్య, వినోద్ పాల్గొన్నారు.

జన్మనిచ్చిన ఊరును మరువద్దు

బోథ్: జన్మనిచ్చిన ఊరును ఎప్పటికీ మరవద్దని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండంలోని కౌఠ(బి) గ్రామంలో ×మన ఊరు కౌఠ(బి) 2025₹ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. గ్రామంపై మమకారంతో క్యాలెండర్‌ను రూపొందించిన ఉపాధ్యాయులు యాల్ల లింగారెడ్డిని అభినందించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసేలా ఉన్న ప్రదేశాలు, భవనాలు, ఆలయాలను క్యాలెండర్‌లో పొందుపరచి, గ్రామంలో ఉన్న ప్రతీ ఇంటికి ఉచితంగా అందించడం గొప్ప విషయమన్నారు. ఐక్యంగా ఉంటే గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు యాల్ల లింగారెడ్డి, వీడీసీ అధ్యక్షులు బడాల శ్రీకాంత్ రెడ్డి, గ్రామస్తులు శాలువాతో సత్కరించారు.

చెక్కు అందజేత

బోథ్ మండలంలోని మర్లపెల్లి గ్రామానికి చెందిన లక్ష్మి నారాయణ శెట్టికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 17,500ల విలువ గల చెక్కును బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండ మండల కేంద్రంలోని తన నివాసంలో ఆదివారం అందజేశారు. ఈసందర్భంగా పేద ప్రజలకు అండగా ఉంటానని అన్నారు.

ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తా

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు డప్పులతో స్వాగతం పలికారు. బోనాల జాతరలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్వరలోనే ఆలయ నిర్మాణానికి టెండర్ పూర్తి చేయిస్తానని అన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉట్నూర్‌రూరల్: పూర్వ గురువులతో పూర్వ విద్యార్థులు

ఇంద్రవెల్లి/ఉట్నూర్‌రూరల్: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1998–99 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మండల కేంద్రంలోని కాగ్నే ఫంక్షన్ హాలులో నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో సత్కరించారు. 25 సంవత్సరాల తరువాత కలుసుకుని ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉట్నూర్‌లోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో 2003–2004 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలు పంచుకున్నారు.



ఇంద్రవెల్లి: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీ

ఆదిలాబాద్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో లిటిల్‌స్టార్ పాఠశాల వార్షిక క్రీడా పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎంతో క్రీడా ప్రతిభ దాగి ఉంటుందని, వారిలోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులు సైతం వారిని నిరంతరం ప్రోత్సహించాలన్నారు. అప్పుడే విద్యార్థుల్లో సర్వతో ముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పెటా జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, ఎస్ఎస్ఏ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ రాకేశ్, ప్రిన్సిపాల్ కమలాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ స్వరూప, వ్యాయామ ఉపాధ్యాయులు రాహుల్ అగార్కర్, తదితరులు పాల్గొన్నారు.

శౌర్య దివస్ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

ఇంద్రవెల్లి: జనవరి 1న ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించే భీమా కోరెగావ్ శౌర్య దివస్‌ను విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉట్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శౌర్య దివస్ పోస్టర్ ఆవిష్కరించారు. మహారాష్ట్రలోని పుణే పట్టణంలో భీమా నది ఒడ్డున ఆత్మగౌరవం కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడి అమరులైన మహర్ వీరుల విజయగాథను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కాంమ్‌రాజ్ వాగ్మరే, సూర్యవంశీ ఉత్తం, పరత్‌వాగ్ దత్త, పవార్ శివరాజ్, కాంబ్లే సునీల్, సావంత్ లహుదాస్ పాల్గొన్నారు.

9న జిల్లా కమిటీ సమావేశం



మాట్లాడుతున్న గోవిందరావు

ఆదిలాబాద్‌రూరల్: 2025 జనవరి 9న ఆదిమ గిరిజన కొలం సేవా సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందరావు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జనవరి 9న పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా కమిటీలోని సభ్యుల మార్పు, రాష్ట్ర కమిటీ నియామకంపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొడప సోనేరావు, టేకం రాజు, సిడాం రాము, జంగు, టేకం రాము, టేకం దిలీప్, మడావి భీంరావ్, జంగు పటేల్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏకలవ్య ఫౌండేషన్ సభ్యుడు రాజులవార్ దిగంబర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కుమురంభీం కాలనీతో నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్, ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుమురం భీం సేవయాత్ర చేపట్టారు. పలు ప్రాంతాలకు చెందిన 150 మంది మెడికోలు, 30 మంది వైద్యులు గిరిజన ప్రాంతాల్లో గత రెండు రోజులుగా వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సామాజిక సమరసత వేదిక సభ్యుడు అప్పాల ప్రసాద్, వాసుజి, వైద్యులు శంకర్, సురేందర్‌బాబు, శ్రీనివాస్, తేజస్విని, సంకల్ప, శ్రీధర్, పూజిత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): భోరజ్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి అసిస్టెంట్ ఏఈ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని భోరజ్, నిరాల, బాలాపూర్, ఫాజీపూర్, పూసాయి, మాండగడ, కామాయి, పిప్పర్‌వాడ, డొలార గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు.

చెక్కు అందజేత

గుడిహత్నూర్: మండలంలోని కొల్హారీ గ్రామానికి చెందిన బండారి తిరుపతికి మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్యాల కరుణాకర్ ఆదివారం లబ్ధిదారుడికి అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు రామారావ్, ఏక్‌నాథ్, ఇసూబ్, సునీల్, రాజులున్నారు.

నూతన కార్యవర్గం

తాంసి: భీంపూర్ మండలంలోని గోండ్వానా పంచాయతీ రాయిసెంటర్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. వడ్గాం గ్రామంలో నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. రాయిసెంటర్ సార్‌మేడిగా మానిక్ రావు, ఉప సార్‌మేడిగా పాండ్‌రంగ్, ఖజాన్ దార్‌గా అరుణ్, గితేదార్‌గా సోమేశ్వర్, సంయుక్త కార్యదర్శిగా అయ్యు, తదితరులను ఎన్నుకున్నారు. రాయిసెంటర్ సమావేశంలో గిరిజన పెద్దలు లచ్చు పటేల్, వినోద్, భీంరావు, కాంతారావు, లింబాజీ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ప్రముఖ వ్యాపారి చింతవార్ సంతోష్ స్వామి నివాసం ఆదివారం అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఎంపీ గోడం నగేశ్‌తో పాటు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరై అయ్యప్ప నామస్మరణం, భజన పాటలు, భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి పటేల్ మారుతి డొంగ్రె, అయ్యప్ప స్వాములు కేంద్రే శ్యామ్, వినోద్, ప్రకాష్ పాల్గొన్నారు.

సన్మానం

కైలాస్‌నగర్: యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సామ రూపేష్ రెడ్డిని తన బాల్యమిత్రులు ఆదివారం సన్మానించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో శాలువాతో సత్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం శ్రమించే తమ స్నేహితుడు ఉపాధ్యక్షుడిగా ఎన్నికవడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ప్రజాప్రతినిధిగా ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

తాంసి: భీంపూర్ మండలం బెల్సరి రాంపూర్ గ్రామంలో జరుగుతున్న అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం సాయంత్రం హాజరయ్యారు. క్రీడకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. యూత్ సభ్యులు శంకర్, సాయికుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

గడప ప్రతిష్ఠాపన పూజలు

తాంసి: మండలంలోని సావర్గాం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయంలో ఆదివారం గడప ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పండితుల మంత్రోచ్చారణ మధ్య పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భారత్, గ్రామపెద్దలు రాకేశ్, రాజు, గౌతమ్ పాల్గొన్నారు.

'గోశాల నిర్మాణానికి కృషి'



మాట్లాడుతున్న గజానంద్ నాయక్

నార్నూర్: ఆదర్శవంతమైన గోశాల నిర్మాణానికి కృషి చేద్దామని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ సాయి గోశాలలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. గోశాల అభివృద్ధి, గోమాత సంరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆడే రామ్ నివాష్ తన సొంత భూమిలో గోశాల నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గోశాల నిర్వాకుడు ఆడే రామ్ నివాస్, ప్రముఖ వ్యాపార వేత్త జ్ఞానోబా సెట్, విశాల్, కుల్తె సంతోష్, గజానంద్ సెట్ పాల్గొన్నారు.